తెలంగాణ నేత్రం
తెలుగు దినపత్రిక
ప్రజల కోసం పోరాటం

Published from Telangana సంపుటి : 2 సంచిక : 220 గురువారం 26 - 06 - 2025 పేజీలు : 4 వెల : 5.00

## బోనాల ఉత్సవాలకు 20కోట్లు విడుదల: మంత్రి పొన్నం



హైదరాబాద్,జూన్25(తెలంగాణనేత్రం. ): జంటనగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని 2,783 ఆలయాలకు వివిధ కార్యక్రమాలు నిర్వహణ కోసం నిధులను చెక్కుల రూపంలో జారీ చేసిందన్నారు. ఆషాఢ మాసంలో ముందుగా నగరంలోని గోల్కొండ బోనాలు జూన్ 29న జులై 1, 2 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ బోనాలు, జులై 13, 14 తేదీల్లో శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవస్థానం బోనాలు, జులై 20న లాల్ దర్వాజా బోనాలు.. జులై 23న చార్మినార్ భాగ్యలక్ష్మి బోనాలు, మిగిలిన దేవాలయాల్లో ఈ ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు.

## నేటినుంచి నగరంలో బోనాల సందడి

**తొలిబోనం గోల్కొండతో ప్రారంభం**
**నెలరోజుల పాటు బోనాల జాతర**



హైదరాబాద్,జూన్25(తెలంగాణనేత్రం): నేటి నుంచి ఆషాడం ప్రవేశంతో జంటనగరాల్లో బోనాల సందడి మొదలు కానుంది. ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బోనాల ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాలను అధికారిక పండుగగా ప్రకటించినది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని అలయాల్లో ఉన్న అమ్మవార్లకు భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. నెల రోజులపాటు ఈ 2

# స్థానిక సంస్థల ఎన్నికలపై తొలగిన అనిశ్చితి

**మూడు నెలల్లో ఎన్నికల నిర్వహణ పూర్తి చేయండి**
**రాష్ట్ర ఎన్నికలసంఘానికి తెలంగాణ హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్,జూన్25(ఆర్ఎన్ఎ): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న అనిశ్చితి తొలగింది. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. సెప్టెంబర్ 30లోగా తప్పనిసరిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. గత కొంత కాలంగా గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ స్థానాలకు ఎన్నికలు జరగకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్త పరుస్తున్నారు. ఈ అంశంపై ఆరుగురు మాజీ సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. వారు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అనంతరం హైకోర్టు ఈ తీర్పును వెల్లడించింది.






అయితే, రాష్ట్ర ప్రభుత్వ తరపున న్యాయవాదులు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం మరో 30 రోజుల గడువు అవసరం అని తెలపడంతో హైకోర్టు ఆ అభ్యర్థనని పరిగణనలోకి తీసుకుంది. దీనితో రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత, ఎన్నికల నిర్వహణకు మరో 60 రోజులు కావాలన్న రాష్ట్ర ఎన్నికల సంఘం అభ్యర్థనకు కూడా కోర్టు అంగీకారం తెలిపింది. దీనివల్ల కలిపి గరిష్ఠంగా 90 రోజుల లోపుల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనితో, 2025 సెప్టెంబర్ 30వ తేదీ లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై పడనుంది. స్థానిక పాలన లోపిస్తున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, ప్రజాప్రతినిధులు లేని పాలన వల్ల గ్రామీణాభివృద్ధి ఇబ్బందిగా 2

# ఇరాన్ న్యూక్లియర్ వ్యవస్థను దెబ్బతీసాం

**కావాలనే కొందరు దీనిని తక్కువ చేసే యత్నం**
**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెల్లడి**




వాషింగ్టన్,జూన్25(తెలంగాణనేత్రం): ఇరాన్‌పై జరిగిన అమెరికా వైమానిక దాడులు ఆ దేశ న్యూక్లియర్ సౌకర్యాలను పూర్తిగా ధ్వంసం చేశాయని డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నారు. కానీ పలు మీడియా నివేదికల నేపథ్యంలో ఇరాన్.. న్యూక్లియర్ కార్యక్రమాన్ని కొన్ని నెలలు మాత్రమే వాయిదా వేశాయని చెబుతున్నాయి. ఈ నివేదికలను ట్రంప్ నకిలీ వార్తలని తోసిపుచ్చారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఎ÷-లాట్‌ఫామ్‌లో ఒక పోస్ట్‌లో ఇలా పేర్కొన్నారు. ఈ వార్తలు ప్రచురించే సీఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్‌లు కలిసి ఈ చారిత్రక విజయవంతమైన సైనిక దాడిని చిన్నబుచ్చే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇరాన్‌లోని న్యూక్లియర్ సౌకర్యాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ మీడియా సంస్థలు ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాయని ట్రంప్ తెలిపారు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా ఈ నివేదికలను పూర్తిగా తప్పు అని తిరస్కరించారు. ఈ నివేదికలు ట్రంప్‌ను అవమానించేందుకు చేసిన ప్రయత్నమని ఆమె అన్నారు. 14 లక్షల కిలోల బాంబులను ఖచ్చితంగా లక్ష్యంపై వేస్తే ఏమవుతుందో అందరికీ తెలుసని అన్నారు. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఆఎం) నివేదిక ప్రకారం, జూన్ 22న అమెరికా ఇరాన్‌లోని మూడు న్యూక్లియర్ కేంద్రాలైన ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌లపై దాడులు జరిపింది. అయితే ఈ దాడుల్లో ఇరాన్ న్యూక్లియర్ ప్రధాన భాగాలను ధ్వంసం కాలేదని , కేవలం కొన్ని నెలల తర్వాత వాయిదా వేశారని ఈ నివేదిక చెబుతోంది. ఈ సౌకర్యాలకు నష్టం జరిగినప్పటికీ, ఇరాన్ న్యూక్లియర్ మౌలిక సౌకర్యాలు చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ షయంపై సమాచారం ఇచ్చిన ఇద్దరు వ్యక్తులు, గుర్తింపు వెల్లడించకుండా, ఈ దాడులు ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ సౌకర్యాలకు నష్టం కలిగించినప్పటికీ, వాటిని పూర్తిగా ధ్వంసం చేయలేకపోయాయని చెప్పారు. ఇరాన్‌లోని అత్యంత సుసంపన్నమైన యురేనియం కొన్ని స్థలాల నుంచి దాడులకు ముందే తరలించబడి సురక్షితంగా ఉందని, సెంట్రిఫ్యూజ్‌లు కూడా చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని వారు తెలిపారు. ఫోర్డోలోని లోతైన భూగర్భ యురేనియం శుద్ధి కర్మాగారం వద్ద 2

## మెట్రో విస్తరణపై కేంద్రం నిర్లక్ష్యం

**కేబినేట్‌లో చర్చించకపోవడం విచారకరం**
**ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోరా**
**ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**




న్యూఢిల్లీ,జూన్25(తెలంగాణనేత్రం): హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అనేక పర్యాయాలు కేంద్రమంత్రులను, ప్రధానిని కలిసి సిఎం విన్నవించినా ఆమోదం దక్కకపోవడం విచారకరమన్నారు. తాజాగా కేబినేట్‌లో ఈ అంశం చర్చించక పోవడం 2

## కేసీఆర్ దమ్ముపై మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదు

హైదరాబాద్,జూన్25 (తెలంగాణనేత్రం): మాజీ సీఎం కేసీఆర్ దమ్ము గురించి మాట్లాడే అర్హత సీఎం రేవంత్‌రెడ్డికి లేదని.. ఆయన దమ్మెంటో కాంగ్రెస్ పెద్దలకు తెలుసునని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మహిళలకు రూ. 2500, పెన్షన్ల మొత్తం పెంపుపై ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా కవిత 2




## రైతు భరోసా ఎందుకు సంబరాలు : డీకే అరుణ



హైదరాబాద్, జూన్25 (తెలంగాణనేత్రం): స్థానిక సంస్థలకు వెళ్లే ధైర్యం కాంగ్రెస్‌కి లేదని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. రెండు ఎకరాలు ఉన్నవారికి కూడా రైతు భరోసా ఇంకా రాలేదని.. అలాంటప్పుడు రైతు భరోసా పేరుతో సంబురాలు ఎందుకు చేసుకుంటున్నారో కాంగ్రెస్ మొదటిపేజీ తరువాయి.నేతలకే తెలియదని 2

## తెలంగాణలో విద్యావ్యవస్థ మరింత పటిష్టం

**అదనపు కలెక్టర్లు పాఠశాలలను సందర్శించాలి**
**కొత్తగా చేరుతున్న పిల్లలకు అనుగుణంగా సౌకర్యాల కల్పన**
**అధికారులకు సూచించిన సిఎం రేవంత్ రెడ్డి**




హైదరాబాద్,జూన్25(తెలంగాణనేత్రం): తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నదని అన్నారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో విద్యాశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి 48 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని సీఎంకు అధికారులు వివరించారు. పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు 2

## బనకచర్ల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు

**బనకచర్ల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు**
**బహిరంగ చర్చకు ఎక్కడికి రావాలో చెప్పండి**
**సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్**

2



# స్థానిక సంస్థల ఎన్నికలపై తొలగిన అనిశ్చితి

మొదటిపేజీ తరువాయి..మారుతుందని పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలలో నూతన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడం, పథకాల అమలు జాప్యం కావడం వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారు కోర్టుకు విన్నపించుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. గ్రామపంచాయతీ ఎన్నికలు 3 నెలల్లో నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు వెలువరించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు 2024 జనవరి 30వ తేదీతో ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ టి.మాధవిదేవి తీర్పు ఇచ్చారు. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరు స్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి‘ అని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్

ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక.. ప్రక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ.. రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

# నేటినుంచి నగరంలో బోనాల సందడి

మొదటిపేజీ తరువాయి..ఉత్సవాలు జరుగుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లను చేసింది. గోల్కొంట కోటలో బోనాలు మొదట ప్రారంభించే సంప్రదాయం వస్తుంది. దీంతో గోల్కొండ బోనాలతో సందడి మొదలు కానుంది. గురువారం మొదలు కానున్న ఈ సందడిలో భాగంగా ఆదివారం గోల్కొండ బోనాలు జరగనున్నాయి. బోనాలు సంప్రదాయం ప్రకారం ప్రసిద్ధి చెందిన గోల్కొండ కోటలోని శ్రీఎల్లమ్మ (జగదాంబిక) ఆలయంలో ప్రారంభం కావడం ఆనవాయితీ. ప్రతీ సంవత్సరం ఆషాడమాసంలో ఆమావాస్య తర్వాత వచ్చే గురువారం, లేదా ఆదివారం బోనాలు ప్రారంభవవుతాయి. అయితే, ఈ నెల బుధవారం అమవాస్య కావడంతో ఆ తర్వాత రోజు గురువారం బోనాల జాతర మొదలుకానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తుంది. బోనాలు ఉత్సవాలకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని శ్రీజగదాంభిక ట్రస్టు బోర్డు ఏర్పాట్లు మొదలుపెట్టింది. ఇప్పటికే మంత్రి పొన్న ప్రభాకర్ సమీక్ష చేశారు. గురువారం నుంచి జూలై 24వతేదీ వరకు తెలంగాణలో బోనాల జాతర జరుగనుంది. నెలరోజుల పాటు ఇక్కడ తొమ్మిది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజలకు నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. వీరికోసం గోల్కొండ కోటలోని అక్కన్న మాదన్న కార్యాలయాలు, బాడిగార్డ్స్ లైన్స్ ప్రాంతాలు సిద్ధం చేస్తున్నారు. పూజల ప్రారంభోత్సవంలో భాగంగా మొదటి రోజు లంగర్‌హౌజ్ చౌరస్తా నుంచి అమ్మవారి తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తారు. చోటాబజార్‌లోని ఆలయం పూజారి ఇంటి నుంచి అమ్మవారి విగ్రహం, ఘట్టం ఊరేగింపు, బంజారాదర్వాజ నుంచి మొదటి బోనం ఊరేగింపు నిర్వహిస్తారు. ఇవన్నీ గోల్కొండ కోటపైకి చేరిన తర్వాత ఆలయం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, బోనం అమ్మవారిక సమర్పిస్తారు. కోటలో బోనాల జాతర జరుగనుండ డడంతో గోల్కొండ కోట పాలన చూస్తున్న కేంద్ర పురావస్తు శాఖ పలు మార్పులు చేయనుంది. బోనాలు జరిగే ఆదివారం, గురువారం రోజుల్లో ఉచిత ప్రవేశం కల్పించారు. కోటలో ప్రతీ రోజు రాష్ట్ర పర్యాటక సంస్థ రెండు లైట్ అండ్ సౌండ్ షోలు నిర్వహిస్తుంది. ఆదివారం, గురువారాలు మొదటి షోను రద్దు చేస్తారు. రెండవ షో 8 గంటల నుంచి యధావిధిగా ఉంటుంది.

# బనకచర్ల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు



సిద్దిపేట,జూన్25( తెలంగాణనేత్రం): బనకచర్ల ప్రాజెక్ట్ గురించి కాంగ్రెస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి 18 నెలల పాలన చూశాక కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో ప్రజలకు అర్థమైందని చెప్పారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలి, కావాలని ప్రజలు అంటున్నారని తెలిపారు. మళ్లీ పదేళ్ల దాకా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా రేవంత్‌రెడ్డి చేశారని అన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదని హరీష్‌రావు ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే నిర్వహించడం లేదని ఆరోపించారు. బుధవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల ప్రశాంత్ పాటిల్ బీఆర్ఎస్‌లో చేరారు. ప్రశాంత్ పాటిల్‌కి హరీష్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హరీష్‌రావు వెంట ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అబద్దాల్లో సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు పోదామని అంటున్నారని.. ఎక్కడికి రమ్మంటారో చెప్పాలని.. తాను సిద్ధమని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రతి సవాల్ విసిరారు. ఏ టీవీలో కూర్చుందామో, ఎక్కడ మాట్లాడుదామో చెప్పు తాను రెడీ... రేవంత్‌రెడ్డి వస్తారో, మహేష్ కుమార్ గౌడ్ వస్తారో చెప్పాలని ప్రతి సవాల్ చేశారు. అసెంబ్లీ నిర్వహించడం చేతగాక రేవంత్‌రెడ్డి పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. వారం రోజులకు మించి అసెంబ్లీ నడిపే పరిస్థితి లేదని చెప్పుకొచ్చారు. మళ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచేది కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు పూర్తిగా అధికారంలో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు ఈ ఎన్నికల కోసం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. అందరం కలసి ఐక్యతతో ముందుకు పోతేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు సాధ్యమని హరీష్‌రావు పేర్కొన్నారు.

# ఇరాన్ న్యూక్లియర్ వ్యవస్థను దెబ్బతీసాం

మొదటిపేజీ తరువాయి.ప్రవేశ ద్వారం కూలిపోయింది. మౌలిక సౌకర్యాలకు నష్టం జరిగింది. అయితే, భూగర్భంలోని ప్రధాన నిర్మాణాలు ధ్వంసం కాలేదని ఒక వ్యక్తి తెలిపారు. గతంలో జరిగిన అంచనాలు కూడా ఈ ఫలితాన్ని హెచ్చరించాయని ఆ వ్యక్తి చెప్పారు. ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడులు పూర్తి విజయవంతమయ్యాయని చెప్పినప్పటికీ, డిఐఏ నివేదిక వారి వాదనలను ఖండిస్తోంది. ఈ దాడులు ఇరాన్ న్యూక్లియర్ కార్యక్రమాన్ని గణనీయంగా దెబ్బతీసినప్పటికీ, దానిని పూర్తిగా నాశనం చేయలేకపోయాయని నివేదిక స్పష్టం చేస్తోంది. ఇది అమెరికా, ఇజ్రాయెల్ నాయకుల వాదనలకు విరుద్ధంగా ఉంది. ఈ వివాదం ప్రస్తుతం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

# మెట్రో విస్తరణపై కేంద్రం నిర్లక్ష్యం

మొదటిపేజీతరువాయి.తెలంగాణకు తీరని అన్యాయమని భావిస్తున్నామని అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ముగ్గురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్రమంత్రులు కుమారస్వామి, పీయూష్ గోయల్, శ్రీపాద యశోనాయక్‌లను కలిసిన శ్రీధర్‌బాబు.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన భూముల అంశంపై చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని కోరారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2పై కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రధాని, కేంద్రమంత్రిని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర క్యాబినెట్‌లో మెట్రోకు అనుమతి వస్తుందని భావించామన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

# తెలంగాణలో విద్యావ్యవస్థ మరింత పటిష్టం

మొదటిపేజీ తరువాయి చేశారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించాలని, గ్యాస్.. కట్టెల పొయ్యిల బాధ లేకుండా మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు సోలార్ కిచెన్లు ఏర్పాటుపై వెంటనే దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణలవుతున్న విద్యార్థులకు, ఇంటర్‌లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య తేడా ఎందుకు ఎక్కువగా ఉందని అధికారుల్ని ప్రశ్నించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్‌లో చేరేలా చూడాలన్నారు. ఇంటర్ తర్వాత జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ పొందొచ్చని, తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు.పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్మీడియట్‌లో నమోదు అవుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉండడంపై సీఎం అధికారులను ప్రశ్నించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# .కేసీఆర్ దమ్ముపై మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదు

మొదటిపేజీ తరువాయి.మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలు, మహిళలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంపై అసెంబ్లీలోనే చర్చిద్దామన్నారు. రేవంత్ రెడ్డి చంద్రబాబును పిలిచి హైదరాబాద్ బిర్యాని పెట్టి గోదావరి నీళ్లను గిఫ్ట్‌గా ఇచ్చారు. 2016లో పోలవరం, బనకచర్ల అంశమే లేదు. రేవంత్ రెడ్డికి అబద్దాలు ఆడడం అలవాటైంది. గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించడం సరికాదు. యస్.. అసెంబ్లీ పెడుదాం ఆరు గ్యారెంటీల అమలు, మహిళలను మోసం చేసినదానిపై చర్చిద్దామన్నారు కవిత. రేవంత్ రెడ్డి హుందాగా వ్యవహరించాలి. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయరు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరు అని కవిత పేర్కొన్నారు. ఇక ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు రాశారు. అబిడ్స్ జీపీవోలో ఎమ్మెల్సీ కవిత, జాగృతి కార్యకర్తలు పోస్ట్ కార్డులను పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. వృద్ధులకు రూ. 2 వేల పెన్షన్‌ను, రూ. 4 వేలు చేస్తామన్న హామీని కాంగ్రెస్ విస్మరించింది. వికలాంగుల పెన్షన్‌ను రూ. 4 వేల నుంచి రూ. 6 వేలకు పెంచకుండా కాంగ్రెస్ మోసం చేసింది. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీ ఏమైంది..? గ్యారెంటీలపై సోనియా గాంధీ సంకతం పెట్టిన గ్యారెంటీ కార్డులను ఇంటింటికి పంచారు. సోనియాగాంధీ ముఖం చూసి ఓట్లేసిన మహిళలను, వృద్ధులను, వికలాంగులు మోసం చేశారు. అందుకే సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు పంపించాము. పెన్షన్ల మొత్తాన్ని పెంచాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలివ్వాలని సోనియా గాంధీని కోరామని కవిత పేర్కొన్నారు.

# రైతు భరోసా ఎందుకు సంబరాలు : డీకే అరుణ

విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌లో బీజేపీ నాయకులందరూ బాధితులేనని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ ప్రభుత్వం ఇంత వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని నిలదీశారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేయించాలని కోరారు. బుధవారం నల్లగొండలో ఎంపీ డీకే అరుణ పర్యటించారు. బీజేపీ నేతలతో పార్టీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. జూన్ 25వ తేదీ దేశ చరిత్రలో చీకటి రోజని తెలిపారు ఎంపీ డీకే అరుణ. ఎమర్జెన్సీ పేరుతో కాంగ్రెస్ చేసిన అరాచకాల గురించి ప్రజలందరికీ తెలియాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆనాడు పేదలపై అరాచకాలు చేశారని.. ఈనాడు సామాజిక న్యాయం అంటూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ తన అజెండాను దేశంపై రుద్దేందుకు రాజ్యాంగ సవరణలు చేపట్టిందని చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిన కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగం గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రపంచ వ్యాప్తంగా లభిస్తోన్న ఖ్యాతిని చూసి రాహుల్ గాంధీ ఓర్వలేక పోతున్నారని ధ్వజమెత్తారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత శక్తి ఏంటో పాకిస్థాన్‌కి చూపించామని తెలిపారు. ప్రధానిని విమర్శించే సీఎం రేవంత్‌రెడ్డి ఎమర్జెన్సీ గురించి ముందుగా మాట్లాడాలని ఎంపీ డీకే అరుణ హితవు పలికారు

# కోమటిరెడ్డిని కలిసిన సమాచార కమిషనర్



హైదరాబాద్,జూన్25(తెలంగాణనేత్రం): సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన ప్రియాంక రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. మర్యాదపూర్వకంగానే కలిసినట్లు వెల్లడించారు.

## మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్ వి కర్ణను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసిన సామాజిక కార్యకర్త సిలివేరు శ్రీకాంత్



జమ్మికుంట: జూన్ 25( తెలంగాణ నేత్రం)
జమ్మికుంట:జమ్మికుంట పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త సిలివేరు శ్రీకాంత్ బుధవారం రోజున ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు చేపట్టిన ఆర్ వి కర్ణను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసినారు ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త సిలివేరు శ్రీకాంత్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు నేతృత్వంలో దళిత కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు హుజురాబాద్ నియోజకవర్గం లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళిత బంధు పథకాన్ని సమర్థవంతంగా పూర్తి చేశారని దళిత కుటుంబాల జీవితాలలో వెలుగులు నింపారని ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త సిలివేరు శ్రీకాంత్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కు గుర్తు చేశారు.

## జిల్లా స్థాయిలో పూర్తయిన స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు

**రాష్ట్ర స్థాయిలో జూలై 1 నుండి 5 వరకు ఎంపిక**

**జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్**



జమ్మికుంట, జూలై25: ( తెలంగాణ నేత్రం)
తెలంగాణలోని స్పోర్ట్స్ పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశం కోసం బుధవారం విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించామని జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్ తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించమని తెలిపారు. . జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో జూలై 1 నుంచి 5 వరకు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు 60 మంది బాలికలకు 60 మంది బాలురులకు అడ్మిషన్లు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రమేష్,శంకరయ్య, నర్సయ్య,బన్సీలాల్, రమ, శ్రీనివాస్, కృష్ణ,దాతత్రి, శ్రీనివాస్,లక్ష్మణ్,సమ్మయ్య, ప్రతిమా, సత్యనారాయణ, శ్రీలత, శ్రీనివాస్ లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు..

## ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారములు

జమ్మికుంట: జూన్ 25( తెలంగాణ నేత్రం)



హుజరాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు గత విద్యా సంవత్సరము 2024- 25 లో ఇల్లందకుంట మండలంలోని ప్రభుత్వ సెక్టార్లలో పదవ తరగతి పరీక్షలో మంచి మార్పులు సాధించిన మొదటి పదిమంది విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ మెమొంటోలు,శంకర్ నారాయణ డిక్షనరీలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయప్రకాశ్ చేతుల మీదుగా అందజేశారు. మొదటి పదిమంది విజేతలు ఓ గణేష్ ఇల్లందకుంట, నవ్య శ్రీ సిరిసేడు, సంజన శ్రీ కేజీబీవీ,పద్మ కేజీబీవీ,యు శ్రీ చైతన్య కేజీబీవీ,కే రామ్ చరణ్ మోడల్ స్కూల్ టేకుర్తి,సాత్విక్ బూజునూర్, నక్షత్ర టేకుర్తి, శివకృష్ణ ఇల్లందకుంట లు బహుమతులు పొందారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరము ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అమూల్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిహెచ్ వేణు తిరుపతి రెడ్డి, మల్లయ్య, రమేష్ ,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల బాధ్యతాయుతమైన బోధనే కారణం

**విద్యార్థిని గిరవేన స్పందన..**

జమ్మికుంట: జూన్ 25( తెలంగాణ నేత్రం)



:జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోరపల్లి లో 2024-25 సంవత్సరానికి 10వ తరగతి చదివి మండలంలో మొదటి ర్యాంక్ సాధించిన గిరవేన స్పందన ఇటీవల కపిల్ చిట్ ఫండ్ వారి ఆధ్వర్యంలో జరిగిన టాలెంట్ టెస్ట్ రాసి ఉన్నత మార్కులు పొంది "కపిల్ విద్యా వారధి"కి ఎంపిక అయ్యింది. దీనికి ఎన్నిక కావడం వలన కపిల్ చిట్ ఫండ్ వారు గిరవేన స్పందన ను ఎంతవరకు చదివితే అంతవరకు ఏ కోర్సు చదివితే ఆ కోర్సులకు సంబంధించిన ఫీజులను మొత్తం చెల్లిస్తుందన్నారు. ఈ సందర్భంగా స్పందనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిడిదొడ్డి సమ్మయ్య, మండల విద్యాధికారి మంతెన హేమలత,అమ్మ ఆదర్శ కమిటీ చైర్పర్సన్ బండారి రజిత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ , తాళ్ళపెల్లి శ్రీనివాస్, గ్రామస్తులు గిరవేన శ్రీనివాస్, కల్లెపెల్లి జంపయ్య, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ హేమలత మాట్లాడుతూ కోరపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయుల శ్రద్ధ, విద్యార్థుల కృషి వల్ల పదవ తరగతిలో కోరపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని అన్నారు. ప్రధానో పాధ్యాయులు సమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు స్పందనను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు బాగా చదవాలని అన్నారు. గిరవేన స్పందన మాట్లాడుతూ తన విజయానికి తన తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉపాధ్యాయుల బాధ్యతాయుతమైన బోధనే కారణమని అందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని స్పందన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు..

## ఆర్జి 1 అధికార ప్రతినిధినీ సన్మానించిన సేవా సమితి సభ్యులు

(గోదావరిఖని) జూన్-25:( తెలంగాణ నేత్రం)



ఆర్జి 1 ఏరియాకు అధికార ప్రతినిధిగా పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సింగరేణి సేవా సమితి సభ్యులు, ఫ్యాకల్టి మెంబర్స్ వారిని పర్సనల్ విభాగంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సేవా సభ్యులు తెలియజేస్తూ సింగరేణిలోనే కీలకమైన రామగుండం ఏరియా-1 అధికార ప్రతినిధిగా భాధ్యతలు చేపట్టటం గొప్ప అవకాశం అన్నారు. ఈ కార్యక్రమములో సేవా సభ్యులు రమాదేవి, సత్యావతి, పద్మ, రేష్మ, శ్రీదేవి, స్రవంతి, శారద, లత, వనితా మరియు సేవా సమితి కో ఆర్డినేటర్ మేడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారులు మా భూమిని ఆక్రమించారని జిల్లా కలెక్టర్ కి జిల్లా కమీషనర్ ఆఫ్ పోలీస్ కి ఫిర్యాదు.

జమ్మికుంట: జూన్ 25( తెలంగాణ నేత్రం)
జమ్మికుంట:కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం (పి.బి.) రెవెనూ పరిధిలోని రామన్నపల్లి గ్రామములో నేను కొనుగోలు చేసిన పర్వేనం. 405/సి లోని భూమి విస్తీర్ణం. 645.60 చ.గజాల డాక్యుమెంటనం. 1414/2020 గల భూమిని కొందరు రియల్ఎస్టేట్ వ్యాపారులు నా భూమిని కబ్జా చేసి నన్ను భయభ్రాంతులకు గురి చేస్తు, చంపుతామని బెదిరింపులకు గురిచేస్తున్నందున నాకు న్యాయం చేయుట గురించి.పై విషయమై తమరికి తెలియజేయునది ఏమనగా, నేను అనగా రాచమల్ల నిర్మల భర్త మహేందర్ నివాసం: కొత్తపల్లి, జమ్మికుంట మున్సిపాలిటీ, వృత్తి చాకలి పని ఇండ్లలల్లో పని చేసుకుంటు, నా భర్త ఇస్త్రీ పని చేసుకుంటు, కట్టెలు కొంటుకుంటు, మేక తలకాయలు కాపుకుంటు జీవనం సాగిస్తున్నాము. మాకు ఇద్దరు పిల్లలు కలరు.మేము రూపాయి, రూపాయి కుడపెట్టుకొని మేము గత ఐదు సంవత్సరాల క్రితం జమ్మికుంట మున్సిపాలిటి పరిధిలోని రామన్నపల్లి గ్రామములోని సర్వేనం. 405/సెలో 645.60 చ.గజాల భూమిని కొలకాని రవి తండ్రి: మంకయ్య వద్ద నుండి మేడిపల్లి మొగిలి అనే వ్యక్తి మద్యవర్తిగా ఉండి నాకు భూమిని కొనుగోలు చేయించినాడు. ఇట్టి డాక్యుమెంట్నం. 1414/2020, తేది: 28.02.2020 రోజున హుజురాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయములో రిజిస్ట్రేషన్ చేసుకున్నాను.సర్వేనం. 405/సిలో (కొలకాని రవి) నాకు అమ్మిన భూమి పోను కొలకాని రవికి మేడిపల్లి వెంకటేశ్వర్లుకు ఇద్దరికి భూమి కలదు. ఇట్టి భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అయిన దేశిని కోటేశ్వర్, ఆరుకాల విరేశలింగం ఆరుకాల కార్తీక్ వీరికి అమ్మినారు. ఇట్టి భూమిని చదును చేసే క్రమములో నా భూమిని హద్దులను నా భూమికి హద్దుల నిర్మాణం కొరకు వేసుకున్న ఇటుకలను మొత్తం బ్లేడ్ ట్రాక్టర్తో చెదరగొట్టి నాయొక్క భూమిని కబ్జా చేసి, హద్దులను లేకుండా చేసినారు. ఇట్టి విషయము నాకు భూమి అమ్మిన యాజమాని కొలకాని రవిని మేడిపల్లి మొగిలి (మున్సిపాలిటి బిల్కలెక్టర్) వెంకటేశ్వర్లు, భూమి కొన్నవారు దేశిని కోటేశ్వర్, ఆరుకాల విరేశలింగం,ఆరుకాల కార్తీక్ మేము రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రకారం నా భూమిని కూడా కబ్జా చేసి చదును చేసినారని నేను నాభర్త ప్రాధేయపడినాము. ముమ్మలను కనకరించకుండా మేము రియల్ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాము.ప్లాట్స్ పెట్టి అమ్ముకుంటాము అని, మేము ఇచ్చిన కాడ భూమి తీసుకుకోవాలని బెదిరించి ఒప్పందం వ్రాసినారు. మా ప్రమేయం లేకుండానే పట్టా చేసుకున్నారు. వారు ఒప్పందం ప్రకారం ఉండకుండా దిక్కరించి భూమి చుట్టూ గోడ నిర్మాణం చేసుకొని అక్రమగా లేవుట్-అవుట్ ప్లాన్ మ్యాప్ తీసి ప్లాట్స్ పెట్టిఅమ్ముతున్నారు.మా భార్యాభర్తలం ఇద్దరము అరుకాల విరేశలింగం, దేశిని కోటేశ్వర్, ఆరుకాల కార్తీక్, మేడిపల్లి మొగిలి, కొలకాని రవి,మేడిపల్లి వెంకటేశ్వర్లు మమ్ముల్ని ఎల్లమ్మ గుడికాడి పిలిపించి, నువ్వు కోర్టుకు వెళ్ళిన, పోలీస్ స్టేషన్ కు వెళ్ళి, కమీషనర్ ఆఫ్ పోలీస్ దగ్గరకు వెళ్ళిన, జిల్లా స్థాయిలో ఏ అధికారి దగ్గరకు వెళ్లిన నీతో ఏమి కాదు. నీ దిక్కున్న చోట చెప్పుకో అని బెదిరించినారు. మేము వినకపోవడంతో మమ్ములను భూమి దగ్గరకు పిలిపించి దేశిని కోటేశ్వర్ మేము తలుచుకుంటే మిమ్ములను రోడ్డుపై కారుతోనైన గుద్ది లేదా మంచినీళ్ళలో విషం ట్యాబ్లెట్ వేసి చంపుగలము. మీరు ఒక్క చిన్న చాకలోనివి అని కులం పేరుతో దూషించుకుంటూ బండ బూతులు తిట్టినారు. మేము ఇచ్చిన కాడ, ఇచ్చినంత భూమి తీసుకోక పోతే ఈ గ్రామములోనే లేకుండా చేస్తామని అనుకుంటూ, ఏ లంజా కొడుకైన మద్దతు పలుకుతాడో చూస్తాము అని మమ్ములను భయభ్రాతులకు గురి చేసినారు. మేమ అప్పుడు ఎంతో కష్టపడి సంపాదించుకున్న రూపాయిలతో, నా బిడ్డ పెండ్లి కొరకు భూమి కొన్నాము అని బ్రతిమిలాడిన కనకరించలేదు. మేము గతంలో సి.పి. కి ఫిర్యాదు చేసిన దరఖాస్తు వాపసు తీసుకోవాలని మమ్ములను భయభ్రాంతులకు గురి చేసినందున నేను అట్టి దరఖాస్తును వాపసు తీసుకోవడం జరిగినది.కావున మా యందు దయతలచి భూమి అమ్మిన కొలకాని రవి, మేడిపల్లి వెంకటేశ్వర్లు మధ్యవర్తి అయిన మేడిపల్లి మొగిలి దేశిని కోటేశ్వర్, ఆరుకాల విరేశలింగం అరుకాల కార్తిక్ నుండి మా కుటుంబానికి ప్రాణహాని ఉన్నది. వీరిపై పూర్తి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకొని మాకు ఉండబడిన సర్వేనెంబర్ 405/సి లో 645.60 చ.గజాల భూమి మాకు ఇప్పించి మాకు న్యాయం చేయగలరని మనవి.

## రామగుండం కమిషనరేట్ పరిధిలో... పోగొట్టుకున్న, చోరికి గురైన 120 మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత

(గోదావరిఖని) జూన్-25:( తెలంగాణ నేత్రం)రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెల్ ఫోన్ యజమానులు పోగొట్టుకున్న/ దొంగాలించబడిన సెల్ ఫోన్ల స్వాధీనంకు సంబందించి సిపి ఆదేశాల మేరకు సిసిఎస్ ఇన్స్పెక్టర్ బాబు రావు నేతృత్వంలో రామగుండము కమీషనరేట్ సీసీఎస్, ఐటీ సెల్ బృందాలు స్వాదినం చేసుకొన్నా సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోగొట్టుకున్న / దొంగలించబడిన సెల్ ఫోన్ల ఆచూకీ కనుగొని పోలీస్ స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్ల ను రామగుండము పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతులమీదుగా సెల్ ఫోన్ యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా సిపి సీఈఐఆర్ గురించి వివరిస్తూ దొంగతనం కాబడిన కానీ లేదా పోగొట్టుకున్న సెల్ ఫోన్ ల ఆచూకీ కోసం సిసిఎస్ తో పాటు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు 6683 సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయగా ఇందులో ఇప్పటి వరకు 2020 సెల్ ఫోన్ల ను స్వాధీనం చేసుకొని సెల్ ఫోన్ యజమానులకు అందజేయడం జరిగిందని, గత కొంతకాలంగా సిసిఎస్, ఐటి సెల్ పోలీసులు శ్రమించి మరో సుమారు 120 సెల్ ఫోన్ల ను గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగిందని, సెల్ ఫోన్ దొంగతనాల నుండి విముక్తి కల్పించడానికై డిపార్ట్మెంట్ ఆఫ్ టెలీ-కమ్యూనికేషన్ సి.ఇ.ఈ.ఆర్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, రామగుండము పోలీస్ కమీషనరేట్ లో తేది 19-04-2023 నుండి ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతుందన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ (%ట్రీజూం://ఱషష.ఎవఱతీ.ౖశీజ.ఱఅ%) నందు బ్లాక్ చేసి, సంబందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. ప్రస్తుత జీవన శైలిలో మొబైల్ ఫోన్ అత్యంత కీలకం అయ్యిందని ఏదైనా సమాచారం తెలుసుకోవాలన్నా, నగదు చెల్లింపులు చేయాలన్నా, ఏదైనా దరఖాస్తు చేసుకోవాలన్నా, మొబైల్ ఫోన్ పైనే ఆదారపడుతున్నామని అన్నారు. ఫోన్ పోయిన లేదా దొంగిలించబడిన ఫోన్ లను వెతికి పెట్టడానికి కమీషనరేట్ పోలీస్



యంత్రాంగం పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందని అయితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ సీఈఐఆర్ అనే అప్లికేషన్ ద్వారా చరవాణి ఎక్కడైనా పోగొట్టుకున్న లేదా చోరికి గురైనా అట్టి చరవాణి లను వెతికి పట్టుకోవడానికి ఎంతో చేయూతనిస్తుందని అన్నారు. ఈ అప్లికేషన్ ముఖ్యంగా మొబైల్ ఫోన్ పోయినప్పుడు అట్టి మొబైల్ ఫోన్ పట్టుకోవాడానికి చాలా ఉపయోగపడుతుందని అన్నారు. సీఈఐఆర్ పోర్టల్ అనేది ప్రజలకు వారి మొబైల్ ఫోన్లు పోయిన లేదా దొంగిలించబడిన సందర్భాల్లో వెంటనే పోలీసులకు తెలియజేసి, వాటిని తిరిగి పొందేందుకు సహాయపడుతుందన్నారు. పోర్టల్లో ఎంటర్ చేసిన ఫోన్ వివరాలు ఇతర రాష్ట్రాల్లో, ఇతర నెట్వర్క్లలో ఉపయోగించగలగకుండా బ్లాక్ చేస్తుంది, దీంతో ఆ ఫోన్ వాడటం కష్టమవుతుందనీ, ఈ విధానం వల్ల చోరీలు తగ్గే అవకాశం ఉంది మరియు ఫోన్లు తిరిగి పొందడం సులభమవుతోంది అన్నారు. ఫోన్ యజమానులు తమ ఫోన్లు తిరిగి పొందినందుకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖకు ధన్యవాదాలు తెలుపుతూ, తమ జీవితాలలో ఈ సాయాన్ని చాలా విలువైనదిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు. స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బాబురావు, సిసిఎస్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ ఎస్ఐలు ఏ.మధుసూదన్ రావు, కే.నరేష్, బి.జీవన్, ఎం.చంద్రశేఖర్, ఎం.శివకేశవులు, ఎన్ శ్రీధర్, ఐటీ సెల్ కోఆర్డినేటర్ కో- ఆర్డినేటర్ హెడ్ కానిస్టేబుల్ రాము, సిసిఎస్ సిబ్బంది, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు

## రోడ్ల పై తిరిగే కేజీ వీల్స్ ట్రాక్టర్ల వాడకం నిషేదం... . జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**కేజీ వీల్స్ వాహనం వినియోగిస్తే మొదటిసారి 5 వేలు, 2వ సారి 10 వేలు, 3వ సారి 20 వేల రూపాయల జరిమానా**

**కజీ వీల్స్ వాడకం నిషేధం పై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి, నవంబర్- 25: ( తెలంగాణ నేత్రం)



రోడ్ల పై తిరిగే ట్రాక్టర్లు కేజీ వీల్స్ వాడకం నిషేదించామని, ఎవరు కూడా కేజీ వీల్స్ తో ట్రాక్టర్ల ను రోడ్లపై నడపరాదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.కేజీ వీల్స్ ట్రాక్టర్లతో రోడ్డు పై నడపడం వల్ల రోడ్లు శాశ్వతంగా పాడవుతున్నాయని, గుంతలు అధికంగా ఏర్పడటం వల్ల ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. రోడ్ల పై కేజీ వీల్స్ వాడకాన్ని పూర్తి స్థాయిలో నిషేధించామని కలెక్టర్ తెలిపారు. రోడ్ల పై కేజీ వీల్స్ ట్రాక్టర్ తో ప్రయాణిస్తూ దొరికితే మొదటిసారి 5000 రూపాయలు, రెండవసారి 10000 రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని, మూడవసారి దొరికిన వారికి 20 వేల రూపాయల జరిమానా విధించడంతో పాటు సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని, దీనిపై సంబంధిత మండలాల తహసీల్దార్,ఎంపీడీవో, ఎం ఏ ఓ, ఎస్ .హెచ్ .ఓ. అధికారులు అప్రమత్తంగా ఉంటూ రోడ్లపైకి వచ్చిన కేజీ వీల్స్ ను వెంటనే జరిమానా విధిస్తూ, సంబంధిత చట్టం కింద కేసులు నమోదు చేయాలని, కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నవజాత శిశు సంరక్షణ ప్రత్యేక యూనిట్ ఏర్పాటుకు చర్యలు..

**.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**డ్రగ్ స్టోర్, ల్యాబ్ రికార్డులను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేయాలి**

**గంట సమయంలో ల్యాబ్ రిపోర్ట్ లు వచ్చేలా చర్యలు**

**నవంబర్ నాటికి 355 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తి**

**రామగుండం జనరల్ ఆసుపత్రి తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



(గోదావరిఖని) జూన్-25:( తెలంగాణ నేత్రం)-
జనరల్ ఆసుపత్రి లోని పిడియాట్రిక్ విభాగంలో నవజాత శిశు సంరక్షణ ప్రత్యేక యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం రామగుండం జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఆసుపత్రిలో ఉన్న డ్రగ్ స్టోర్, సెంట్రల్ ల్యాబ్, చిన్నపిల్లల విభాగం, ఆర్ట్ సెంటర్, చర్మ చికిత్స ఓటి, ఇతర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, చిన్నపిల్లల విభాగంలో నవజాత శిశు సంరక్షణ ప్రత్యేక యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పిల్లల కోసం అవసరమైన వార్మర్లను వెంటనే కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
జనరల్ ఆసుపత్రిలో డ్రగ్ స్టోర్, ల్యాబ్ వైద్య పరీక్ష రికార్డులను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేయాలని అన్నారు. ల్యాబ్ నుంచి వైద్య పరీక్షల ఫలితాలు గంట సమయంలో వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
డ్రగ్ స్టోర్ లో గడువు ముగిసిన మందులు పూర్తి స్థాయిలో తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో ఇన్ పేషెంట్ సేవలు మరింత మెరుగ్గా అమలు చేయాలని అన్నారు. అనంతరం 142 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 355 పడకల ఆసుపత్రి పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం మూడవ అంతస్తు స్లాబ్ పని పూర్తి అయిందని, నవంబర్ నాటికి పూర్తి స్థాయిలో ఆసుపత్రి నిర్మించి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సింగరేణి వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందు సింగ్, గోదావరిఖని ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ రాజు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం


జమ్మికుంట: జూన్ 25 ( తెలంగాణ నేత్రం)



జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామానికి చెందిన రాచపల్లి (ఎడ్ల) సమ్మయ్య మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం రోజున జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం బిజిగిరి షరీఫ్ గ్రామంలోని మృతుడు రాచపల్లి (ఎడ్ల) సమ్మయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఆయన కుమారులు రాచపల్లి అంబేద్కర్ రాచపల్లి జగ్జీవన్ లను మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ రాచపల్లి (ఎడ్ల) సమ్మయ్య మృతి వారి కుటుంబానికి తీరని లోటని రాచపల్లి ఎడ్ల సమ్మయ్య ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతుని ఆశీర్వాదం ఎల్లవేళలా వారి కుటుంబానికి ఉండాలని కోరారు ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచపల్లి రమేష్ నగరం గ్రామ శాఖ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకు సంపత్ తదితరులు ఉన్నారు

## 27న హైదరాబాదులో ఇందిరా పార్క్ వద్ద జరిగేధర్మాను విజయవంతం చేయండి.

జమ్మికుంట: జూన్ 25( తెలంగాణ నేత్రం)
:ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసే విధానాలను ప్రతిఘటిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని డి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి అన్నారు. ఈరోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోరపల్లిలో కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో తెచ్చిన 25 జీవో నిబంధనలను రద్దు చేయాలని, విద్యా వ్యవస్థను ధ్వంసం చేసే విధానాలను మానుకోవాలని , విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను అరికట్టి ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ విద్యను అభివృద్ధి పరచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో విదేశీ ప్రైవేట్ విశ్వ విద్యాలయాలను అనుమతివ్వకూడదని ప్రాథమిక పాఠశాలల్లో ప్రమాణాలు గల పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి అందుకు సుశిక్షితులైన ఉపాధ్యాయులను నియమించాలని, విద్యారంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న 30 వేల పాఠశాలలను అభివృద్ధి చేసి , ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి పథంలో నడపాలని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో 27 నా హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు విద్యా పరిరక్షణ కమిటీ భాగస్వామ్య సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్షులు వేణుమాధవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్. సమ్మయ్య, పి . రాజయ్య, పి . రాజు , కుమారస్వామి, రవికాంత్ రాజు , పద్మ , విజెందర్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## జీడికె 11వ ఇంక్లైన్ గనిని సందర్శించిన ఎలక్ట్రికల్ డిఎంఎస్

(గోదావరిఖని) జూన్-25:( తెలంగాణ నేత్రం)




జి.డి.కె 11 ఇంక్లైన్ గనిని ఎలక్ట్రికల్ డిఎంఎస్ కోమల్ చౌదరి బుధవారం సందర్శించారు. గని ఏజెంట్ కార్యాలయం గనిలోని వివిధ సీమ్/ ప్యానెల్, యంత్రముల వివరాలను ప్లాన్ల ద్వారా పరిశీలించారు. గని ఉత్పత్తి ఉత్పధకను, గనిలో తీసుకోవల్సిన రక్షణ చర్యల గురించి వివరించారు. తధనంతరం గనిలోని 1వ సీమ్ సీఎం 1 సెక్షన్ ను తనకీ చేసి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గని ఏజెంట్ శ్రీనివాస్, ఏరియా సేఫ్టీ అధికారి సాయి ప్రసాద్, గని మేనేజర్ మల్లేశం, ఇంచార్జి గ్రూప్ ఇంజనీర్ ఓదెలు, రక్షణ అధికారి మల్లేష్, గని పిట్ ఇంజనీర్ రాకేష్, సెక్షన్ ఇంచార్జి వెంకటేష్, జీఎంఎంసీఓ ఇంచార్జ్ రాకేష్, ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారి కొమురయ్య, వెంటిలేషన్ అధికారి గని వర్క్మ మెన్ ఇన్స్పెక్టర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన

(గోదావరిఖని) జూన్-25:( తెలంగాణ నేత్రం)



ఉన్నతాధికారుల ఆదేశానూసరంగా మహాత్మ జ్యోతిరావ్ పూలే బీసీ వెల్ఫేర్ స్కూల్ లో డ్రగ్స్ నియంత్రణ వారోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమంను గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఉత్తర్వుల మేరకు గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ భూమేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మత్తు పదార్థాలపై విద్యార్థుల భవిష్యత్తు, జీవితం నాశనం అవుతున్నాయని, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలకు ఒకసారి దీనికి బానిసలు అయితే ఎలాంటి నేరాలకు పాల్పడడానికైనా వెనకాడరన్నారు. విద్యార్థులందరూ చెడు అలవాటులకు అలవాటు పడకుండా తమ భవిష్యత్తును మంచి మార్గంలో నడిపించే చదువు పైన దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. మేము గంజాయి, డ్రగ్స్ తీసుకొము, బంధుమిత్రులు, చుట్టుపక్కల వారు, స్నేహితులు మాధకద్రవ్యాలకు అలవాటు పడకుండా వారిని చూసుకునే బాధ్యత మాదే అని డ్రగ్స్ వల్ల కలిగే అనార్థాల గురించి వారికి వివరిస్తాం అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీచర్లు, వన్ టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్జీ 1 ఏరియాలో ఫిట్టర్, ఎలక్ట్రిషియన్ సర్ఫేస్ పోస్టుల కౌన్సిలింగ్

(గోదావరిఖని) జూన్-25:( తెలంగాణ నేత్రం)




అర్జీ 1 ఏరియా జిఎం కార్యాలయంలో ఫిట్టర్, ఎలక్ట్రిషియన్ సర్ఫేస్ పోస్టుల కోసం కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ కమిటి అధికారులైన యస్ఓటు జియం గోపాల్ సింగ్, ఏరియా ఇంజనీరు దాసరి వెంకటేశ్వర్ రావు, ఏజీఎం ఐఈడి ఆంజనేయులు, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. కౌన్సిలింగ్ కు ఆర్.జి 1 ఏరియాకు సంబందించిన ఫిట్టర్ లు, ఎలక్ట్రిషియన్ ఉద్యోగులు వివిధ గనుల నుండి పాల్గొన్నారు. మెత్తం ఫిట్టర్ సర్ఫేస్ పోస్టుల కోసం 47 మంది దరఖాస్తు చేసుకోగా సినియారిటి ప్రాతిపదకన 8 పోస్టులను ఇవ్వటం జరిగింది. ఎలక్ట్రిషియన్ పోస్టుల కోసం 44 మంది దరఖాస్తు చేసుకోగా 7 పోస్టులను సినియారిటి ప్రాతిపదకన భర్తీ చేయటం జరిగింది. వీరికి సీనియారిటీ ఆధారంగా సర్ఫేస్ పోస్టులను ఇవ్వటం జరిగిందని, కౌన్సిలింగ్ ను పూర్తి పారదర్శకంగా కమిటి అధికారుల సమక్షంలో నిర్వహించారు. కౌన్సిలింగ్ సీనియర్ పిఒ ఎం.డి.ఫిరోజ్ ఖాన్, సీనియర్ అసిస్టెంట్ అన్వేష్, వివిధ గనుల ఫిట్టర్, ఎలక్ట్రిషియన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పట్టణాలు, నగరాల్లో పనులు పూర్తి చేయండి: సిఎం

హైదరాబాద్,జూన్ 25(తెలంగాణ నేత్రం): పట్టణాల్లో, నగరాల్లో అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పురపాలకశాఖపై సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో అభివృద్ధి పనుల గురించి సీఎంకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో శానిటేషన్, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థపై శ్రద్ధ వహించాలన్నారు. రోడ్లపై నీరు నిలిచే చోట ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓఆర్‌ఆర్ వరకు కోర్ అర్బన్ రీజియన్‌లో భవిష్యత్ అవసరాలకు ప్రణాళికలు చేయాలన్నారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రోడ్లు, మెట్రో కనెక్టివిటీ, ఎలివేటెడ్ కారిడార్లపై పూర్తి ప్రణాళికతో రావాలని చెప్పారు. రాబోయే 25 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం దిశానిర్దేశర చేశారు.

## 90 శాతం విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా చర్యలు.

**.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**పాఠశాలలకు రెగ్యులర్ గా ఉపాధ్యాయులు విధులకు హాజరు కావాలి**
**ఎలిగేడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెడ్ మాస్టర్ లతో విద్య పై సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్**




పెద్దపల్లి, జూన్-25:-( తెలంగాణ నేత్రం

ప్రస్తుత విద్యా సంవత్సరంలో 90 శాతం విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఎలిగేడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెడ్ మాస్టర్ లతో విద్య పై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభం లోనే లక్ష్యాలను నిర్దేశించుకోని వాటి సాధన దిశగా కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం పాఠశాలలో 15 శాతం కంటే ఎక్కువ ఉపాధ్యాయులు ఒకే రోజు సెలవు తీసుకోకుండా చూడాలని అన్నారు. ఉపాధ్యాయుల హాజరు పక్కాగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మరమ్మత్తులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులు చేశామని, ఎక్కడైనా ఇంకా అవసరం ఉంటే ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ సూచించారు. రాబోయే వర్షాకాలం నేపథ్యంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత లో ఎటువంటి రాజీ ఉండవద్దని అన్నారు. పాఠశాలలో పిచ్చి మొక్కలు ఉంటే వెంటనే తొలగించాలని, ఎక్కడా పాములు రాకుండా చూడాలని అన్నారు. విద్యార్థుల నాణ్యత ప్రమాణాలు పెంచేందుకు ప్రణాళిక ప్రకారం పని చేయాలని అన్నారు. తెలుగు, ఇంగ్లీష్ చదవడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్ వంటి కనీస విద్యా ప్రమాణాలు ప్రతి విద్యార్థికి అందేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కొంతమంది విద్యార్థులు చదువుతున్నారు కానీ అది అర్థం చేసుకోలేక పోతున్నారని,దీనిని అధిగమించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చోరువ చూపి పని చేయాలని అన్నారు.ప్రతి 2 నెలలకు కాంప్లెక్స్ పరిధిలో రివ్యూ సమావేశాలు నిర్వహించాలని, వీటిని పకడ్బందిగా నిర్వహించాలని అన్నారు. ప్రతి నెలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపు పై సమావేశాలు పెట్టుకోవాలని అన్నారు. 90 శాతం విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా మనం పని చేయాలని, దీనికి అనుగుణంగా అవసరమైన ప్రణాళికలను పాఠశాల పరిధిలో సిద్దం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జి.సి.డి.ఓ కవిత, పీఎం షేక్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమాజం నుంచి డ్రగ్స్‌ను దూరం చేయాలి

**తెలంగాణ ప్రభుత్వం అందుకు కట్టుబడి ఉంది**
**పోలీసులు మరింత కఠినంగా వీటిని అణచివేయాలి**
**యాంటీ డ్రగ్స్ డే ర్యాలీలో మంత్రి పొన్నం ప్రభాకర్**




హైదరాబాద్,జూన్25(తెలంగాణ నేత్రం): డ్రగ్స్ నుంచి భవిష్యత్‌లో సమాజాన్ని కాపాడటానికి తెలంగాణ ప్రభుత్వం సంకల్పం తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మాదక ద్రవ్యాల కేసులు వస్తే కఠినంగా వ్యవహరించాల్సిందే అని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు జాబ్స్‌తో బిజీగా ఉంటున్నారని.. ఈ క్రమంలో పిల్లలు చెడుకు బానిసలు అవుతున్నారన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్ జలవిహార్ వద్ద యాంటీ డ్రగ్స్ డే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, సినీ హీరో నిఖిల్ హాజరయ్యారు. డ్రగ్స్ వాడకంపై వ్యతిరేకంగా మంత్రులు, టీజీ న్యాబ్ ఉన్నతాధికారులు షార్ట్ ఫిలింను రిలీజ్ చేశారు. అలాగే డ్రగ్స్ నివారణపై పోస్టర్లను మంత్రులు విడుదల చేశారు. ఈ సంధ్భంగా పొన్నం మాట్లాడుతూ.. డ్రగ్స్ ఎవరు తీసుకున్నా ప్రభుత్వానికి , పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కొద్ది రోజుల క్రితం తెలంగాణ పోలీసులు గోవా వెళ్లి డ్రగ్స్ ముఠా చైన్ కూడా బ్రేక్ చేసినట్లు తెలిపారు. డ్రగ్స్ అమ్మేవారిని సమాజం నుంచి బహిష్కరించాలన్నారు. మాదక ద్రవ్యాలు తెలంగాణలో కనబడవద్దు అనే నినాదంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రపంచంలో తెలంగాణ పోలీస్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. డ్రగ్స్ నివారణపై పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. డ్రగ్స్ నివారణే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని మంత్రి కోరారు. వారం రోజుల పాటు డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కోవిడ్ తర్వాత , కోవిడ్ సమయంలో లాక్ డౌన్ ఎఫెక్ట్‌తో యువత నిర్బంధానికి గురి అయ్యారని.. ఆ సమయంలో ఫ్రెండ్స్ గ్రూప్స్‌గా ఏర్పడి డ్రగ్స్‌కు అలవాటు పడ్డారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డ్రగ్స్ నివారణపై చాలా సీరియస్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. డ్రగ్స్ నివారణపై ప్రతీసారి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డ్రగ్స్ అమ్మేవారిని, రవాణా చేసేవారిని గుర్తించి అరెస్ట్ చేస్తున్నామన్నారు. డ్రగ్స్‌కు బానిస అయిన విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. 7, 8 తరగతి స్టూడెంట్స్ కూడా డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని తెలిపారు. డ్రగ్స్ కంట్రోల్ చేస్తున్న లిస్ట్‌లో తెలంగాణకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని సీపీ ఆనంద్ వెల్లడించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటే జీవితం సంతోషంగా ఉంటుందని సినీ హీరో నిఖిల్ అన్నారు. చిన్నపుడు నుంచి సిగరెట్, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం వల్లే తన జీవితం సంతోషంగా ఉందని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. జీవితంలో హీరో, డాక్టర్, యాక్టర్, సైంటిస్ట్ అవ్వాలి అంటే ముందుగా ఆరోగ్యంగా ఉండాలని హీరో నిఖిల్ పేర్కొన్నారు. కాగా.. ఈ కార్యక్రమానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ , మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యతో పాటు వివిధ కళాశాల విద్యార్థులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## జర్నలిస్టుల సమస్యలు సానుకూలంగా పరిష్కరించండి

**చిన్న పత్రికల సమస్యలు తక్షణం పరిష్కరించండి**
**కమీషనర్ ప్రియాంక కు టిఎస్ జెయు వినతి**

హైదరాబాద్ జూన్ 25 :( తెలంగాణ నేత్రం)



జర్నలిస్టులపై దాడులను నివారణ కోసం జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీలను ఏర్పాటు చేయాలని కొరుతూ తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్ జెయు) ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్ డిపార్ట్ మెంట్ (ఐ అండ్ పిఆర్) కమీషనర్ ప్రియాంకను కలిసి వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్ జెయు) రాష్ట్ర అధ్యక్షులు నారగౌని పురుషోత్తం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఇండియా ఎన్ యుజె(ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, రాష్ట్ర కోశాధికారి పాపని నాగరాజు, రాష్ట్ర నాయకులు ముత్యం ముఖేష్ గౌడ్, అశోక్ లు ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే విషయంలో ప్రభుత్వమే స్వయంగా జర్నలిస్టుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా చిన్న పత్రికలో ఎంప్యానల్ మెంట్ జరగకపోవడం వల్ల చిన్న పత్రికల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే చిన్న పత్రికలను ఎంప్యానల్ మెంట్ చేయాలని, అదేవిధంగా ఏబిసిడి వర్గీకరణను తొలగించాలని వారు కోరారు. చిన్న పత్రికలతో పాటు మీడియాకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రెస్ అండ్ మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని వారు కోరారు.

## మెట్రో రైలులో పొగ.. ప్రయాణికులకు ఇబ్బందులు



ముంబై, జూన్25 (తెలంగాణ నేత్రం): మెట్రో కోచ్‌లోకి దట్టమైన పొగ రావడంతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఊపిరాడక దగ్గుతో విలవిల్లాడారు. ముఖాలకు అందుబాటులో ఉన్న క్లాత్‌లు, మాస్కులు అడ్డుపెట్టుకున్నారు. ఏం జరుగుతోందో తెలియని అయోమయం, గందరగోళం చెలరేగింది. ముంబై బోరివలి ఏరియాలోని దేవిపద మెట్రో స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వెస్టన్ ఎక్స్‌ప్రెస్ హైవేపై ఒక ప్రైవేటు బస్సు మంటల్లో చిక్కుకోవడం, అదే సమయంలో దేవిపద మెట్రో స్టేషన్‌లో రైలు ఆగడంతో పొగలు ఒక్కసారిగా కోచ్‌లోకి ప్రవేశించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. సంఘటన వివరాల ప్రకారం, దేవిపద మెట్రో స్టేషన్‌కు పక్కనే ఆపి ఉన్న ఖాళీ బస్సు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకుంది. దీంతో మెట్రో సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను చల్లార్చడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే, మెట్రో స్టేషన్ కిందనున్న రోడ్డుపై బస్సు పార్కింగ్ చేసి ఉండటంతో దట్టమైన పొగలు వెలువడ్డాయి. అదే సమయంలో మెట్రో రైలు ఆగడం, తలుపులు తెరుచుకోవడంతో ఒక్కసారిగా పొగలు కోచ్‌లోకి ప్రవేశించాయి. యోగేష్ నామ్‌జోషి అనే ప్రయాణికుడు ఇందుకు సంబంధించిన 50 సెకన్ల వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు వీడియోను ట్యాగ్ చేశాడు. ఈ ఘటనపై మహా ముంబై మెట్రో ఆపరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ విచారం వ్యక్తం చేసింది. రైలులో అగ్నిప్రమాదం కానీ, ప్రమాదం కానీ జరగలేదని తెలిపింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్టు పేర్కొంది.

## అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

హైదరాబాద్,జూన్25 (తెలంగాణ నేత్రం): ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్కలు నాటాలని మేడ్చల్ జిల్లా బీజేపీ కన్వీనర్ మల్లారెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవరం కాంతరావు, మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. మూసాపేటలో ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశాన్ని కాలుష్యరహితంగా మార్చాలన్న ఉద్దేశంతో ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారని, మన ఇంటికి ఇరువైపులా, ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అడవులు రోజురోజుకు అంతరించి పోతున్నాయని దానివల్ల వర్షాలు తగ్గడమే కాకుండా సూర్యతాపం మరింత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి బీజేపీ కన్వీనర్ శ్రీకర్‌రావు, పద్మయ్య, ఎర్రస్వామి, మహిళా మోర్చా అధ్యక్షురాలు జానకి, లీగల్‌సెల్ సద్గుణరెడ్డి, రవిగౌడ్, రేవతి, శోభరాజన్ తదితరులు పాల్గొన్నారు.

Printed published and THUDI NAGARAJU printed at YESHASHWIN printers,D.NO.2-5-1/1 GHANDHI NAGAR, GODAVARIKHANI, peddapalli district,,,505209, TELANGANA, published at D.NO.,7-3-34, janagam, Village , govt HOSPITAL LINE, GODAVARIKHANI TOWN,Ramagundam, mandal , peddapalli district T.S.505209,Editor :THUDI NAGARAJU,TELTEL 2023/88263, email :Nagaraju.thudi@gmail.com,cell8985557050